క్లుప్తంగా

సూర్యప్రభ వాహనంపై వేంకటరమణుడు



వేంకటరమణస్వామి ఊరేగింపు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారు భక్తులకు సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీవారిని సింహవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఇండియన్‌రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, కౌన్సిలర్ బండి అజయ్ తదితరులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో బలిజ సంఘం సభ్యులు, ఆలయ పాలక కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి శేష వాహనోత్సవ కార్యక్రమం ఉంటుందని ఈఓ తెలిపారు.

వైభవంగా హులిగమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట



పూజలందుకున్న హులిగమ్మ దేవి అమ్మవారు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హులిగమ్మ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో గంగపూజ,, గణపతి పూజ, కంకణధారణ, నవగ్రహ పూజ, చండీహోమం, చండీ పారాయణం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి హులిగమ్మ దేవి అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించారు. తెల్లవారుజామున ఆలయ ఆవరణలో ప్రాణప్రతిష్టాపన హోమాన్ని నిర్వహించి, ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అలాగే ఆలయం గోపురంపై కలశాన్ని, ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి తనయుడు కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

బెళగల్లేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవ పూజలు



హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

బెళుగుప్ప: మండల కేంద్రంలో బెళగల్లేశ్వర స్వామి ఆలయాన్ని ఇటీవల ఎక్కేల గోత్ర వంశయులు నిర్మాణపనులు పూర్తి చేసి, శుక్రవారం ప్రారంభోత్సవ పూజలు, హోమాలు నిర్వహించారు. వేదపండితులు రామకృష్ణాచారి, వనం మల్లికార్జున శర్మ పండిత బృందం గణపతి పూజ, ప్రదాన కలశ స్థాపన పూజ, యంత్రపూజ, దీక్షా , దేవీ సంబంద, వాస్తు మండల హోమాలు చేపట్టారు. శనివారం కురబల కుల గురువు గోవిందవాడ మృత్యుంజయ వడయార్ నేతృత్వంలో గంగపూజ, దేవతా మూర్తుల ఊరేగింపు, శయ్యాదివాసం. తదంగ హోమాలు నిర్వహించనున్నారు. ఆదివారం సూర్యోదయాత్పూర్వం 4.35 గంటలకు నూతన ఆలయంలో బెళగల్లేశ్వరస్వామి, యల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి హోమాలు చేపట్టనున్నారు.

కమనీయం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయదుర్గం రూరల్: వైశాఖ శుద్ద పౌర్ణమి, నరసింహస్వామి జయంతి సందర్భంగా మండలంలోని మల్లాపురం గ్రామ పరిధిలో వెలిసిన విప్రమలై లక్ష్మీనవనరసింహ స్వామి కల్యాణోత్సవం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి పునీతులయ్యారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ, అర్చకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాన్ని చేరుకోవాలి

వజ్రకరూరు: ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రం నుంచికలెక్టర్ అన్ని మండలాల అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ అనిల్ కుమార్, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

‘దుర్గం’లో దంచికొట్టిన వాన

- కళ్యాణదుర్గంలో 96 మి.మీ. వర్షపాతం నమోదు



బొమ్మనహాళ్: వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

కళ్యాణదుర్గం/రాయదుర్గం టౌన్: కళ్యాణదుర్గం, రాయదుర్గం డివిజన్‌లో గురువారం రాత్రి వర్షం దంచేసింది. కళ్యాణదుర్గం మండలంలో ఏకంగా 96.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అదేవిధంగా బెళుగుప్ప, గుమ్మఘట్ట మండలాల్లో 43.4 మి.మీ., బొమ్మనహాళ్‌లో 37.2 మి.మీ., కణేకల్లులో 35.0 మి.మీ., బ్రహ్మసముద్రంలో 33.2 మి.మీ., శెట్టూరులో 27.2 మి.మీ., కంబదూరులో 25.4 మి.మీ., రాయదుర్గంలో 22.4 మి.మీ, డి.హీరేహాళ్‌లో 9.8 మిల్లీమీటర్లు, కుందుర్పిలో 12.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

కంబదూరు: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షాలకు వివిధ పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం జరిగింది. భారీగా వర్షం కురువడంతో వేరుశనగ, వరి, మామిడి తదితర పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి జాఫర్ పరిశీలించారు.

కణేకల్లు: మండలంలో గురువారం రాత్రి వర్షం కురిసింది. కణేకల్లు, సొల్లాపురం, ఎన్.హనుమాపురం, 43 ఉడేగోళం, బెణికల్లుతోపాటు వివిధ గ్రామాల్లో వర్షం కురిసింది. వర్షపాతం 35 మి.మీ.గా నమోదైంది. భారీ వర్షంతో వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. తీవ్రమైన ఎండలు.. ఉక్కపోతతో ప్రజలు విలవిలాడిపోతున్న క్రమంలో ఒక్కసారిగా

బొమ్మనహాళ్: మండలంలోని బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, లింగదహాళ్, శ్రీధరఘట్ట, కృష్ణాపురం, కొలగానహళ్లి, ఏలంజి, మైలాపురం, ఉంతకల్లు, నేమకల్లు, బండూరు, గోవిందవాడ, దర్గాహొన్నూరు తదితర గ్రామాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షానికి అక్కడక్కడ వరి పంట నేలకొరింది. పత్తి పంటలో వర్షపు నీరు చేరింది. రబీలో ముందుగా సాగు చేసిన వారు నూర్పిళ్లు పూర్తవడంతో ధాన్యాన్ని రోడ్డు, బయలు ప్రదేశాల్లో ఆరబెట్టుకున్నారు. ఆరబోసిన ధాన్యం తడిస్తే రంగు మారుతుందని రైతులు భయాందోళన చెందుతున్నారు. ధాన్యం తడవ కుండా పట్టలపై నిల్వ ఉన్న నీటిని తొలగించుకుంటున్నారు.

గుమ్మఘట్ట: మండలవ్యాప్తంగా వున్న గ్రామాలలో శుక్రవారం రాత్రి వర్షం దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బీటీప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం వుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కలుగోడు గ్రామంలో వర్షం దెబ్బకు పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు ఏఓ నిర్మల్‌కుమార్ తెలిపారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో గురువారం రాత్రి 39 మీల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. పలు కాలనీలు జలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ప్రజా సేవతోనే సంతృప్తి

- రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్‌గా రెండోసారి ఎంపికవడం హర్షణీయం
- ‘సాక్షి’ తో కాపు భారతి వెల్లడి



రాయదుర్గం: ప్రజా సేవతోనే సంతృప్తి సాధ్యమని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. వరుసగా రెండోసారి చైర్‌పర్సన్‌గా ఎంపికైన సందర్భంగా ఆమె గడిచిన మూడేళ్లలో అందించిన సేవా కార్యక్రమాలపై శుక్రవారం ‘సాక్షి’ తో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే.. దేశంలోనే గొప్ప మానవతా సంస్థ ‘రెడ్‌క్రాస్’ అని కొనియాడారు. అలాంటి సంస్థలో ప్రజలకు సేవచేసే భాగ్యం దక్కినందుకు సంతోషనిచ్చిందన్నారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదిలోనే కరోనా మహమ్మారి పెద్ద భూతంలా ప్రజల పై విరుచుకు పడిందన్నారు. తొలిసవాల్‌గా తన ముందు నిలవడంతో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అనంత జిల్లాలో ధీటుగా ఎదుర్కొనేలా కృషి చేశామని గర్వంగా చెప్పారు. బ్రాహ్మణి వెల్ఫేర్ సొసైటీ సహకారం తో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు.

సేవకు గుర్తింపు..

నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై గిట్టని వారు కొందరు దుష్ప్రచారం చేయడం సమంజషం కాదని కాపు భారతి హితవు పలికారు. ఉత్తమ సేవలు గుర్తించే రెండోసారి ఏకగ్రీవంగా చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారని కృతజ్ఞతలు తెలిపారు. కరోనా సమయంలో బ్రాహ్మణి వెల్ఫేర్ సొసైటీ సహకారం, రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్, హెల్త్, పోలీస్, ప్రెస్, వలంటీర్, ఇతర కార్మిక వర్కర్లందరికీ మాస్కులు, శానిటేషన్లు అందించామన్నారు. రాయదుర్గం పట్టణంలో ప్రతి గురువారం ప్రజలకు మాస్కులు, వాటర్ పాకెట్లు పంపిణీ చేపట్టామన్నారు. ఆస్పత్రికి రోగులతో పాటు వచ్చే వారికి ఆరు నెలల పాటు రెండు పూటలా భోజన వసతి సమకూర్చామన్నారు. అలాగే హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో 200 పీపీ కిట్లు, రూ.లక్షల విలువ చేసే శానిటేషన్లు, మాస్కులు అందించామన్నారు. మెబైల్ ఆక్సిజన్ సమకూర్చి ప్రాణాలు కాపాడే బాధ్యత తీసుకున్నామన్నారు. బ్లడ్ నిల్వలు పెంచేలా కృషి చేశామన్నారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో 500 పీపీ కిట్లు, అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఆర్టీసీ డిపోల్లో 500ల పీపీ కిట్లు, మాస్కులు, శానిటీజర్లు ఇచ్చిన ఘతన రెడ్‌క్రాస్‌దేనని గుర్తుచేశారు. రాయదుర్గం ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం కోసం రూ.30 లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయించామన్నారు. అలాగే ఆల్‌మర్చెంట్ అసియేషన్, మెడికల్, రైస్‌మిల్స్, అనంతపురం లో క్లాత్ మర్చెంట్స్ వారి సహకారం తీసుకున్నామన్నారు. వీరందరితోనూ నగదు కాకుండా కేవలం వస్తు రూపంగా మాత్రమే సేకరించి ప్రజలకు అందించామన్నారు. క్వారంటైన్ కేంద్రానికి 20 సిలిండర్లు వితరణ చేశామన్నారు.

రాయదుర్గంలో సంబరాలు..

రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్‌గా కాపు భారతి రెండోసారి ఎంపిక కావడం పట్ల రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. సేవకే పట్టం కట్టారని జిల్లా కలెక్టర్‌తో పాటు రెడ్‌క్రాస్ సభ్యులను అభినందించారు.

మహిళా సంఘాలను ఇబ్బంది పెట్టొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అందించిన ఆసరా సొమ్ము ఇవ్వకుండా మహిళలను ఇబ్బంది పెడుతారా...ఇది సరైన పద్ధతేనా అంటూ వైఎస్సార్ క్రాంతి పథం(వైకేపీ) అధికారులపై ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక వైకేపీ కార్యాలయానికి ఎమ్మెల్సీ హాజరై మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు ‘ఆసరా’ కింద సంఘం ఖాతాలకు డబ్బు చేస్తే ఉరవకొండలో మాత్రం స్త్రీనిధి సొమ్ము కట్టలేదని కొర్రీ పెడుతూ ఆసరా డబ్బులు ఇవ్వకుండా సభ్యులను ఇబ్బంది పెడుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు 15 రోజుల్లోపు మహిళా సంఘాలకు ఆసరా డబ్బు జమ చేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని వైకేపీ ఇన్‌చార్జ్ ఏపీ శివయ్యకు హెచ్చరించారు.

పెన్నహోబిలం రథం కూలిన ఘటనపై విచారణ చేపట్టాలి:

పెన్నహోబిలంలోని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రథం కూలిన ఘటనపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ ద్వారా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రథం తయారీ కోసం దాతలు ఇచ్చిన డబ్బుతో పాటు అదనంగా ప్రభుత్వం మరికొంత వేసి వచ్చే ఏడాదిలోగా నూతన రథాన్ని సిద్ధం చేయాలన్నారు.

భూ సర్వే రాళ్లను తొలగిస్తే కఠిన చర్యలు

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రెవెన్యూ డివిజన్‌లోని పొలాల్లో పాతిన సర్వే రాళ్లను తొలగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ నిశాంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో ఉన్న 151 గ్రామాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రీ సర్వే చేశామన్నారు. ఇందులో మొదటి విడతగా 33 గ్రామాల్లో సర్వే బృందాలు, రైతుల సమన్వయంతో రైతులు, ప్రభుత్వ భూములను గుర్తించి ఆధునిక సర్వే పరికరాలతో హద్దులు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు అయ్యే ఖర్చు పూర్తి బాధ్యతను ప్రభుత్వమే భరించి సర్వే రాళ్లను ఏర్పాటు చేసిందన్నారు. భూములలో పాతిన రాళ్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. బాధ్యతలను విస్మరించి సర్వే రాళ్లను తొలగించినా, పాడు చేసినా సదరు వ్యక్తులపై ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ యాక్ట్ 1984 అండర్ సెక్షన్ 3 (1), 3 (2) ప్రకారం భారతీయ శిక్షాస్మృతి అండర్ సెక్షన్ 434, 114 మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ సెక్షన్ల ప్రకారం ఒక సంవత్సరం నుంచి ఐదేళ్ల పాటు జైలుశిక్ష, జరిమానా విధించబడుతుందని ఆయన స్పష్టంచేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఎస్‌ఐ రంగడుయాదవ్

డి హీరేహాళ్(రాయదుర్గం): అసాంఘిక కార్యాకలాపాలతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ రంగడుయాదవ్ హెచ్చరించారు. డి హీరేహాళ్ పీఎస్‌లో ఎస్ఐగా శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు.. ఇక్కడ ఎస్‌గా పనిచేసిన ఎస్ఐ రామకృష్ణారెడ్డిని గుత్తికి బదిలీ చేశారని, ఆత్మకూరు పీఎస్ నుంచి తాను బదిలీపై వచ్చానన్నారు. సరిహద్దు ప్రాంతానికి ఆనుకుని మండలం ఉండడంతో అక్రమ రవాణా తో పాటు కొత్త వ్యక్తుల కదలికల పై నిఘా ఉంచుతామన్నారు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల తనిఖీ ముమ్మరం చేస్తామన్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట



ఆలయంలో పూజలు చేయిస్తున్న కాపు ప్రవీణ్‌రెడ్డి

కణేకల్లు: మండలంలోని ఎస్.హనుమాపురంలో నూతనంగా నిర్మించిన జోడు మారెమ్మదేవి, ముత్యాలమ్మదేవి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలులు ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో రూ.50 లక్షల వ్యయంతో జోడు మారెమ్మదేవి ఆలయం, రూ.15 లక్షల వ్యయంతో ముత్యాలమ్మదేవి ఆలయం నిర్మించిన విషయం విదితమే. విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని రెండ్రోజుల నుండి ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, పూజలు చేపట్టారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తనయుడు కాపు ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ సర్పంచు సురేంద్ర, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, గోపులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, నాయకులు హర్షవర్ధన్, కెనిగుంట రామిరెడ్డి, సొల్లాపురం భాస్కర్‌రెడ్డి, ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ రెడ్డి

రాయదుర్గం రూరల్: వాహనచోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించి , క్షేమంగా గమ్యస్థానం చేరాలని ఎంవీఐ విశ్వనాథ్ రెడ్డి సూచించారు. మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అధ్యక్షతన శుక్రవారం రోడ్డు నిబంధనలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీరామ్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరాల తల్లీ.. పాహిమాం



లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం



ఊరేగుతున్న లక్ష్మీ నరసింహుడు

కళ్యాణదుర్గం: వరాల తల్లీ.. పాహిమాం.. పాహిమాం.. అంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారిని ఆరాధించారు. కోటవీధిలో లక్ష్మీ నరసింహ స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం స్వామి మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అనంతరం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. సాయంత్రం స్వామి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

ఉరవకొండ: సెపక్‌తక్రా క్రీడలో విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని సెపక్‌తక్రా సంఘం జిల్లా చైర్మన్ సప్తగిరి మల్లికార్జున అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయ ఆవరణలో సెపక్‌తక్రా సంఘం, ఉరవకొండ లయన్స్ క్లబ్ సంయుక్తంగా జిల్లాలోని 15 సెపక్‌తక్రా క్లబ్‌లకు బాల్స్, నెట్స్, క్రీడాదుస్తులు, ఫిట్నెస్ సామగ్రిని ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్, సప్తగిరి మల్లికార్జున చేతుల మిదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు లక్ష్మీనారాయణ, నజీర్, బాలచంద్ర, గణేష్‌బాబు, ప్రభాకర్, శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మోరార్జీయాదవ్, వ్యాయమ ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల తీరుపై ఫిర్యాదు

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారుల తీరుపై గ్రామ సచివాలయ కన్వీనర్ కె.పార్వతి, సర్పంచ్ సరేంద్ర తదితరులు డీఎంఅండ్‌హెచ్‌ఓ వీరబ్బాయికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన పలువురు రోగులు ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. ఆ సమయంలో ఆస్పత్రి తలుపులు మూసి ఉంచడంపై రోగులు విషయాన్ని సర్పంచు, సచివాలయ కన్వీనర్ దృష్టికి తీసుకువెళ్లారు. వారు వెంటనే డీఎంఅండ్‌హెచ్‌ఓ వీరబ్బాయికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. మూడురోజులుగా సాయంత్రం నాలుగు గంటలకే ఆస్పత్రి తలుపులు మూసి వేస్తున్నారన్నారు. 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

అనంతపురం క్రైం: కళ్యాణదుర్గం కొత్తూరు గ్రామానికి చెందిన మంజునాథ్ అనే వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.90 వేలు చెక్కును తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మంజునాథ్, అతని తల్లి పేట లక్ష్మిదేవి ఎంపీ తలారి రంగయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పరామర్శ

గుమ్మఘట్ట: మండలంలోని గుమ్మఘట్ట సమీపంలో గురువారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో గాయపడిన క్షతగాత్రులను రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి శుక్రవారం పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని సవీరా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమరేష్, నాగరాజు, శృతి, వినోద్‌కుమార్‌ను పరామర్శించి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, నాయకులు ఏకాంత, దేవరాజు, మల్లప్ప, ఆనంద్, ఆంజినేయ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుండె వైద్య శిబిరం

శెట్టూరు: మండల కేంద్రంలో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పోస్టు రామకృష్ణ తెలిపారు. మంత్రి ఉషశ్రీ చరణ్ ఆశీస్సులతో ఆదివారం కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యుల సహకారంతో శిబిరం నిర్వహిస్తామన్నారు. శిబిరాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తక్షణసాయం అందజేత

బొమ్మనహాళ్: మండలంలోని సిద్దరాంపురం గ్రామానికి చెందిన హరేసముద్రం అడివప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆంజనేయులు బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. అనంతరం వైఎస్సార్ భీమా పథకం ద్వారా తక్షణసాయం రూ. 10 వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. మిగిలిన మొత్తం బాధితుల బ్యాంకు ఖాతాలోకి జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీ ర్లు పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్/వజ్రకరూరు: రాయదుర్గం పట్టణంలోని ఆదర్శ పాఠశాల (ఏపీ మోడల్ స్కూల్)లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.వెంకటేశులు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో (httpr://apmr.ap.gov.in) నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అనంతరం హార్డ్ కాపీని స్కూల్‌లో అందజేయాలన్నారు. ఈ నెల 9 నుంచి 25వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో జూన్ 11వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఓసీ, బీసీలకు 150 పరీక్ష ఫీజు ఉంటుందన్నారు. అలాగే వజ్రకరూరులోని ఆదర్శపాఠశాల(మోడల్)లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్యామలాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కళ్యాణదుర్గం మండలం దొడగట్ట-1 (బీసీ-బీ), బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లి-1 (బీసీ-ఈ) ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 12లోపు దరఖాస్తులకు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి గ్రామంలో కొద్ది రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. ఎంపీడీఓ వెంకట నాయుడు శుక్రవారం ఆ గ్రామంలో పర్యటించారు. సర్పంచ్ రంగప్ప, పంచాయతీ కార్యదర్శి సత్యమ్మతో కలసి మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఆయన గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీటీసీ బూసప్ప , ఇంజినీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గవిమఠం పీఠాధిపతి ఆరోగ్యంపై ఆందోళన వద్దు

ఉరవకొండ: తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ గవిమఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహస్వామి ఆరోగ్యం క్షీణించిదంటూ వస్తున్న వదంతులపై భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పీఠాధిపతి ఆరోగ్యం బాగానే ఉందని గవిమఠం ఏజెంట్ రాజన్నగౌడ్ తెలిపారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం తుంకూరు మఠంలో పీఠాధిపతిని ఏజెంట్‌తో పాటు అర్చకుడు విరుపాక్షయ్య, దేవదాయ శాఖ సిబ్బంది కలసి ఆశీర్వచనం పొందారు.

పెన్షనర్లకు ఈ-కేవైసీ తప్పనిసరి

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ పెన్షన్‌దారులు సకాలంలో సీఎఫ్‌ఎంఎస్ ఐడీ, ఆధా నెంబర్‌తో ఈ-కేవైసీ అనుసంధానం చేసుకోవాలని సబ్ ట్రెజరీ అధికారి యుగంధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ట్రెజరీ ద్వారా పింఛను పొందుతున్న పెన్షన్‌దారులందరూ విధిగా ఈ-కేవైసీ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పెన్షన్‌దారులు ఎవరికీ ఇబ్బందులు లేకుండా ట్రెజరీ కార్యాలయంలోనే ఈ-కేవైసీ చేయిస్తామన్నారు. ఆధార్‌కార్డు, ఆధార్‌తో అనుసంధానం చేసి ఫోన్, సీఎఫ్‌ఎంఎస్ ఐడీతో పెన్షన్‌దారులు రావాలని సూచించారు. ఎవరైనా సొంతంగా ఫోన్‌లోనే చేసుకోవాలంటే పేరోల్‌హెర్ప్ యాప్‌లో అనుసంధానం చేసుకోవచ్చన్నారు. రాయదుర్గం ట్రెజరీ పరిధిలో 690 మంది పెన్షన్‌దారులుండగా ఇప్పటి దాకా 350 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారన్నారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

కంబదూరు: మండలంలోని పాళ్లూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్టీసీ ఖాళీ స్థలానికి టెండర్ల ఆహ్వానం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం డిపోనకు సంబంధించి పావగడ రోడ్డులో ఉన్న 2.47 ఎకరాల ఖాళీ స్థలానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎం రామచంద్ర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ పక్కన ఖాళీ స్థలంలో 40 అడుగులు రోడ్డు ఏర్పరిచి, ఖాళీ స్థలాన్ని తొమ్మిది బిట్లుగా చేసి వ్యాపార నిమిత్తం వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి గల వ్యాపారులు www.aprrtc.a p.gov.in వెబ్ సైట్ నందు టెండర్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. టెండర్ దరఖాస్తును ఈనెల 23 మధ్యాహ్నం 2 గంటల లోపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫీస్, కడపకు పంపాలని ఆయన సూచించారు.

గుండెపోటుతో భక్తుడి మృతి

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం శ్రీలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తుడు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన ఎరికల శ్రీరాములు(65) తన మనవుడితో పెన్నహోబిలంలోని నరసింహస్వామిని దర్శించుకోవడానికి వచ్చాడు. స్వామి దర్శనం అనంతరం ఆలయం కింది భాగంలో ఛాతీలో నొప్పిరావడంతో అక్కడే కుప్పకూలాడు. గమనించిన భక్తులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది శ్రీరాములును ఉరవకొండ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య సుంకమ్మతో పాటు రాయదుర్గంలో ఎక్సైజ్ శాఖలో పని చేసే కుమారుడు శ్రీనివాసులు ఉన్నారు.